ఒక్క ఫోన్‌కాల్‌తో ఇంటి ముంగిటకు..



రైతు వద్దకు వచ్చి పశువుకు సేవలందిస్తున్న సంచార పశువైద్యశాల సిబ్బంది

- పాడి పశువులకు మెరుగైన సేవల కోసం సంచార వైద్యశాలలు
- 1962 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

పెద్దాపురం: పాడి పరిశ్రమకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. రైతు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ద్వారా ఆర్థిక సాధికారత సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. పశువులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సంచార పశువైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పాడి గేదెకు ఆరోగ్య సమస్య తలెత్తినప్పుడు రైతు ఇబ్బందులు పడకుండా గంట వ్యవధిలోనే సంచార వైద్యశాల(వాహనం) వారి ఇంటి ముందుండేలా చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున సంచార పశు వైద్యశాల వాహనాన్ని మంజూరు చేసింది. ఈ సేవల ప్రారంభంతో పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పశువైద్యానికి టోల్ ఫ్రీ నెంబర్

పశువుకు జబ్బు చేసినప్పుడు 1962 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే రైతు ఇంటి ముంగిటకే సంచార సంచార వైద్యశాల వాహనం వచ్చి వాలుతుంది. సంచార వైద్యశాలలో పశువైద్యుడు, పశువైద్య సహాయకుడు వచ్చి చికిత్స అందించే విధంగా చర్యలు చేపట్టారు. సంచార పశువైద్యశాల కార్యక్రమానికి సంబంధించి కాకినాడ జిల్లాకు ఏడు వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు పశువైద్యాధికారులు తెలిపారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు ఏడు వాహనాలు కేటాయించారు.

వాహన సేవలు ఇలా

రైతు తమ పశువుకు వైద్యం అందించాలని టోల్‌ఫ్రీ నెంబర్ 1962కి కాల్ చేయగానే గంట వ్యవధిలో సంచార వైద్యశాల అంబులెన్స్ అక్కడికి చేరుకుంటుంది. పశువైద్యుడు వైద్యం అందించాక అవసరమైతే పశువును అదే వాహనంలో ఆసుపత్రికి తరలిస్తారు. వాహనంలో వెనుకభాగాన అమర్చిన హైడ్రాలిక్ గ్రిల్ ద్వారా పశువును ఎక్కిస్తారు. ఈ హైడ్రాలిక్ గ్రిల్‌కు సుమారు రెండువేల కిలోల బరువును ఎత్తగలిగే సామర్థ్యం కలిగి ఉంటుంది. దీంతో పశువును సునాయసంగా వాహనంలోకి ఎక్కించి ఆసుపత్రికి తరలిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వైఎస్సార్ సంచార పశు వైద్యశాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఏ సమయంలోనైనా తమ పశువులకు ఇబ్బందులు కలిగితే 1962 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే వాహనంలో పశువైద్యులు వచ్చి పశువుకు చికిత్స చేస్తారు.

– డాక్టర్ రాకేష్, పశువైద్యాధికారి, ఆర్‌బీ పట్నం, పెద్దాపురం మండలం

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: వైద్యం ప్రజలందరికీ సమానంగా అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తోందని, ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. బుధవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు ఆయన పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేయగా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ దాసం వెంకటేష్, వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణు, ఎంపీటీసీ జి నూకరాజు, వైద్య సిబ్బంది, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

పంజాబ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అండర్ 19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన గొల్లప్రోలు మండలం తాటిపర్తి ప్రభుత్వ హైస్కూలు విద్యార్థిని వేంపల సత్యసౌమ్యను ఎమ్మెల్యే పెండెం దొరబాబు అభినందించారు.

గ్రామాలకు కార్పొరేట్ వైద్యం

కొత్తపల్లి: కార్పొరేట్ వైద్యాన్ని గ్రామాలకు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే చెందుతుందని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని కుతుకుడుమిల్లి శివారు పెద్దకలవలదొడ్డిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించారు. వేలకు వేలు వెచ్చించే ఈసీజీ, అల్ట్రాసౌండ్‌తో పాటు అనేక రకాల వైద్య పరీక్షలను ప్రభుత్వం ఈ శిబిరాల ద్వారా ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ శిబిరంలో 417 మందికి వైద్య పరీక్షలను నిర్వహించినట్టు వైద్యాధికారి మౌనిక తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కర్రి చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మాజీ సర్పంచి కర్రి ఏసుబాబు, డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాస్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ శ్రీనివాస్, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దాపురం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలుచేస్తుందని ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు అన్నారు. బుధవారం మండలంలోని జి.రాగంపేటలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బంగారు కృష్ణ, ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్, కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు కాలే అనురాధ పాల్గొన్నారు.



జి.రాగంపేట శిబిరంలో మందులు అందజేస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ వీరబాబు



రోగులకు మందులను అందిస్తున్న జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్

భారీగా భవానీ దీక్షల స్వీకరణ

పిఠాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పాదగయ క్షేత్రంలోని శక్తిపీఠం పురూహూతికా అమ్మవారి దివ్య సన్నిధిలో గత వారం రోజులుగా భవానీ దీక్షాధారణలు ప్రారంభించారు. సోమ, మంగళ, బుధవారాల్లో 13 వేలకు పైగా భక్తులు భవానీ దీక్షలు స్వీకరించారు. బుధవారం పాదగయ క్షేత్రం దీక్షలు స్వీకరించే భక్తులతో కిటకిటలాడింది. ఈ క్షేత్రంలో నిత్యం శ్రీరాజరాజేశ్వరీ దేవి, పురూహూతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలలోను వేలాది మంది భవానీ దీక్షలు చేపట్టారు. వారం రోజులుగా పాదగయ క్షేత్రంతో పాటు ఇతర దేవాలయాల్లోను నిత్యం వందల మంది భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు. దీక్షాధారులతో ఈ క్షేత్రం అరుణ వర్ణంలో, భక్తిభావనలతో అలరారుతున్నాయి.



పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: అన్నవరం– హంసవరం మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడి 30 ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుని వద్ద లభించిన టికెట్ ఆధారంగా అస్సాం వాసిగా గుర్తించామన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

హోటల్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేట సెంటర్‌లోని న్యూ కృష్ణాస్ సుబ్బయ్య హోటల్‌పై బుధవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. వినియోగదారుడు కొనుగోలు చేసిన కూరలో పురుగులు ఉండడంతో అతను ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్, ఫుడ్‌సేఫ్టీ అధికారి కేవీ సుబ్బారావు ఆధ్వర్యంలో హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. పలు ఆహార పదార్థాల శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపుతామని ఫుడ్‌సేఫ్టీ అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఆగష్టు 12న ఇదే హోటల్‌పై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించి నాణ్యత లేని జీడిపప్పు, కారం వంటి వాటిని ల్యాబ్‌కు పంపగా అవి పాడైనట్లు రిపోర్టు వచ్చిందన్నారు. హోటల్ యజమాని సుబ్బారావు గుప్తాపై కేసు నమోదు చేశామని, ఇది జాయింట్ కలెక్టర్ కోర్టులో పెండింగ్ ఉందన్నారు. హోటల్‌లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు తయారు చేసే ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని నోటీసులు జారీ చేశారు.

ఉల్లాసంగా బాలుర అథ్లెటిక్స్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో అండర్–14, 17 బాలుర అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో 1,000 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్–14 బాలుర విభాగంలో 9 అంశాల్లో, అండర్–17 బాలుర విభాగంలో 13 అంశాల్లో రన్స్, త్రోస్, జంప్స్‌లో క్రీడాకారులకు ప్రతిభాపరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి జిల్లా జట్టుకు 54 మందిని ఎంపిక చేశారు. ఎంపికల నిర్వహణలో 95 మంది పీడీలు సహకారం అందించారు. జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ సభ్యులు టీవీఎస్ రంగారావు, పీడీలు గిరి, ప్రసాద్‌రెడ్డి, బాబి, కొరు, శ్రీనివాస్, సింహాద్రి, శ్రీహరి రాజు, సురేష్ పాల్గొన్నారు. ఎంపికలను జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఎంపికలు 13కు వాయిదా

ఈనెల 12న పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడలో జరగాల్సిన పలు క్రీడాంశాల్లో ఎంపికలు ఈ నెల 13కు వాయిదా వేసినట్లు సంఘ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. కబడ్డీ అండర్17, 14 బాలురు, జూడో అండర్–14, 17 బాలికలు ఎంపికలు జరుగుతాయన్నారు. 13న జరగాల్సిన ఎంపికలు యథావిధిగా జరుగుతాయని, ఈ మార్పును పీడీలు గమనించాలని ఆయన కోరారు.

చేనేత కార్మికుల కళా నైపుణ్యం భేష్

- ఇన్వెస్ట్ ఇండియా బృందం సభ్యులు
- జాంధానీ చీరలకు జాతీయ అవార్డుపై పరిశీలన
- ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై ఆరా



ఉప్పాడలో జాంధానీ చీరలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కొత్తపల్లి: చేనేత కార్మికుల కళా నైపుణ్యం ఎంతో భేష్ అని, మగువల మనసులను కట్టిపడేసే ఈ జాంధానీ చీరలకు రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే పేరు ప్రఖ్యాతులు సాధించడంలో వీరి కృషి దాగి ఉందని ఇన్వెస్ట్ ఇండియా బృందం సభ్యులు రాబిన్ చెరియన్, నమీరా అన్నారు. జాంధానీ చీరల నేషనల్ అవార్డుకు జౌళిశాఖ అధికారులు దరఖాస్తు చేయడంతో బుధవారం ఢిల్లీ నుంచి వచ్చిన ఇన్వెస్ట్ ఇండియా సభ్యులు ఇద్దరు కొత్తపల్లి, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పర్యటించారు. తొలుత కలెక్టర్ కృత్తికా శుక్లాను కాకినాడలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఉప్పాడలో ఉన్న చేనేత సొసైటీలో తయారు చేస్తున్న జాంధానీ చీరలు పరిశీలించి ప్రభుత్వం ద్వారా చేనేత కార్మికులకు అందిస్తున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. చేనేత మగ్గాలను పరిశీలించి చీరల తయారీ, కావాల్సిన ముడి సరుకు, తయారీకి పట్టే సమయం, వేతనాలపై ఆరా తీశారు. వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులతో సమావేశమై వారి సమస్యలను, ప్రభుత్వం ద్వారా ఏఏ లబ్ధి చేకూరింది వంటి విషయాలను చర్చించారు. పలు జాంధానీ దుకాణాలలో చీరలను పరిశీలించి, మాస్టర్ వీవర్స్‌తో సమావేశమయ్యారు. బృందం సభ్యులు మాట్లాడుతూ భారత ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ట్– వన్ ప్రొడక్ట్ కార్యక్రమంలో భాగంగా బృందం సభ్యులు జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉత్పత్తులను పరిశీలిస్తారన్నారు. నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. చేనేత జౌళిశాఖ ఏడీ పెద్దిరాజు మాట్లాడుతూ జాంధానీ చీరలకు జాతీయ అవార్డు కోసం రెండు నెలల క్రితం దరఖాస్తు చేశామన్నారు. దీనిపై ఢిల్లీ నుంచి వచ్చిన బృందం చేనేత గ్రామాలలో పర్యటించి ఆరా తీసిందన్నారు. వీవర్స్ సర్వీసు సెంటర్ విజయవాడ నుంచి హిమజ కుమార్, మాస్టర్ వీవర్స్ లొల్ల వీరవెంకట సత్యనారాయణ, శీలామంతుల నరేష్, రొబ్బి నటరాజ్, దైవం మహేష్, ఆనపు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసుల జోక్యంతో జీజీహెచ్‌లో దుకాణం మూసివేత

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో సక్రమంగా అద్దెలు చెల్లించని దుకాణాలను కలెక్టర్ ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ లావణ్యకుమారి బుధవారం మూయించారు. ప్రసూతి విభాగం ఎదుట ఉన్న టెలిఫోన్ బూత్ పేరుతో అనుమతులు పొంది మినీ మార్టు నిర్వహిస్తున్న చొల్లంగి వేణుగోపాల్ అత్యధికంగా అద్దె బకాయిపడ్డారు. సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ పుష్కరరావు, ఆర్‌ఎంవో డాక్టర్ రాహుల్‌ల ఆధ్వర్యంలో బృందం సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో మూయించేందుకు విఫలయత్నం చేశారు. దీంతో అధికారుల పిలుపుతో పోలీసులు జోక్యం చేసుకుని దుకాణాన్ని మూయించారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

కొత్తపల్లి: మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని పొన్నాడ శివారు కోపపాపపేట ఎంపీపీ పాఠశాలలో నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ ఎగ్జిక్యూటర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బేటీ బచావో-బేటీ పఢావో, లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై విద్యార్థులకు అవగాహన కలిపంచారు. స్థానిక వీవీఎస్ విద్యా సంస్థల పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్ల అంటే అమ్మ- ఇస్తుంది మనకు జన్మ, ఆడపిల్లను రక్షించుకుందాం, సృష్టిని కాపాడుకుందాం అని నినాదాలు చేశారు.


కోపపాపపేట ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది


కొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బొట్టు పెట్టి స్వాగతం


ముఖ్యమంత్రి పర్యటనకు మహిళను ఆహ్వానిస్తున్న 11వ వార్డు కౌన్సిలర్ నమ్మి దుర్గ

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మొట్టమొదటి సారిగా సామర్లకోటకు గురువారం రానున్న నేపథ్యంలో అధికార పార్టీ కౌన్సిలర్లు మహిళలకు కుంకుమ బొట్లు పెడుతూ స్వాగతం పలుకుతున్నారు. వారితో పాటు వలంటీర్లు, సచివాలయ, మెప్మా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి పర్యటనకు ఆహ్వానించారు. హెలీప్యాడ్ ప్రదేశం నుంచి జగనన్న కాలనీ వరకూ దారి పొడవునా ప్రజలు ముఖ్యమంత్రిని చూసేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని బహిరంగ సభకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న దాత చక్రధరరావు

పిఠాపురం: పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయానికి వెన్నపు చక్రధర ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెన్నపు చక్రధరరావు పుస్తకాలను బహూకరించినట్లు గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకర్రావు తెలిపారు. పోటీ పరీక్షల విభాగంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. అల్లవరపు నగేష్, ప్రసాద్ మాస్టారు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సామర్లకోట: మండల ప్రజా పరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. అయితే గురువారం సామర్లకోటలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయాలని ఎంపీటీసీ సభ్యులు కోరుతున్నారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట పర్యటనను దృష్టిలో ఉంచుకుని గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి తెలిపారు. కాకినాడ వైపు నుంచి సామర్లకోట వచ్చే వాహనాలు అచ్చంపేట జంక్షన్ నుంచి తిమ్మాపురం, పిఠాపురం బైపాస్ మీదుగా మళ్లిస్తామన్నారు. అదే విధంగా మాధవపట్నం వైపు నుంచి వచ్చే హెవీ వాహనాలు ఉండూరు బ్రిడ్జి నుంచి అచ్చంపేట జంక్షన్‌కు వెళ్లవలసి ఉంటుందని చెప్పారు. బిక్కవోలు, అనపర్తి వైపు నుంచి సామర్లకోటకు వచ్చే వాహనాలను బలభద్రపురం మీదుగా మళ్లించనున్నట్లు చెప్పారు. రాజానగరం నుంచి వచ్చే వాహనాలను పాండవుల మెట్ట మీదుగా గుర్రాల సెంటర్ నుంచి జగ్గంపేట హైవే మీదుగా మళ్లిస్తామన్నారు. ఆర్టీసీ బస్సులు సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌కు వచ్చి అక్కడి నుంచి ఏడీబీ రోడ్డు మీదుగా వెళ్లవలసి ఉంటుందన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు

ఆటోలకు సామర్లకోట టీటీడీసీ ట్రైనింగ్ సెంటర్, పిఠాపురం రోడ్డులో పెట్రోలు బంకు వద్ద, సామర్లకోట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటుచేశామన్నారు. పోలీసు అధికారుల వాహనాలు మాత్రమే పోలీసు క్వార్టర్స్‌లో ఉంచాలన్నారు. కార్లను జెడ్పీ బాలికల హైస్కూల్, మోటారు సైకిళ్లు కోట్లమ్మ చెరువు, బస్సులను పెదపులి చెరువ ఏరియాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలని సూచించారు.

లారీ స్టాండ్ వద్ద భారీ అన్నదానం

సామర్లకోట: స్థానిక లారీ స్టాండ్ వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్, వర్క్స్ యూనియన్ ఆధ్వర్యంలో సుమారు 10 వేల మందికి అన్నదానం చేసినట్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్ తెలిపారు.